గజగజలాడిస్తున్న గజరాజులు

పంట పొలాలు.. షెడ్డు ధ్వంసం

పెద్దపంజాణి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త
మండలంలో మరలా గజరాజుల దాడులు మొదలయ్యాయి. మూడు ఏనుగుల గుంపు గ్రామీణ ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. గిడ్డవారిపల్లి గ్రామంలో సుబ్రమణ్యంరెడ్డికి చెందిన షెడ్డును ధ్వంసం చేశాయి. అలాగే దాణాను తొక్కి తినేశాయి. అలాగే అదే గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డికి చెందిన మామిడితోటతో పాటు వరి పంటను ధ్వంసం చేశాయి. దీంతో సుమారు లక్ష రూపాయల దాకా నష్టం కలిగినట్లు బాధిత రైతు వాపోయాడు. మంగళవారం రాత్రి అటవీ సిబ్బంది దొరస్వామి, రవికుమార్‌లు ట్రాకర్ల ద్వారా అటవీ ప్రాంతంలో ఏనుగులను తరిమేశారు. అయితే ఏనుగులు మరలా దాడులు జరిపే ప్రమాదం ఉందని రైతులు, ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మూడు ఏనుగుల బృందం కీలపట్ల అటవీ ప్రాంతం నుంచి వచ్చినట్లు తెలుస్తోంది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మకర వాహనంపై కపిలేశ్వరుడు

రాత్రి శేషవాహనంపై సోమస్కందుడు

తిరుపతి, ఫిబ్రవరి 14ప్రభాతవార్త:
తిరుపతిలోని కపిలేశ్వర ఆలయంలో స్వామివారికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం కామాక్షి అమ్మవారి సమేతుడై సోమస్కందమూర్తి మకరవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత అమ్మవారితో కలసి స్వామివారు నగర వీధుల్లో ఊరేగారు. మకరం గంగాదేవికి వాహనం. గంగ పరమశివుని శిరస్సుపై నివసిస్తోంది. మకరం జీవప్రకృతికి ఉదాహరణ. ఉదయం 10.30గంటల నుంచి స్వామివారికి ఆలయ అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ వాహనసేవల్లో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజారోహణం

-శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా, కన్నుల పండుగా కైలాసనాథుని తిరునాళ్ళుకు ధ్వజారోహణం నిర్వహించారు.,, మధ్యాహ్నం 1 గంటకు పూజల్ని ప్రారంభించారు. సోమవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణ తరువాత బ్రహ్మోత్సవాలకు శ్రీకారం కాగా స్వామి ధ్వజారోహణ ప్రారంభోత్సవం అని చెప్పవచ్చు. ఉదయం 10గంటలకు పట్టణ ప్రజలకు వెండిపల్లకీల్లో స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చి ఆలయానికి చేరుకున్న తరువాత స్వామి గర్భగుడి ఎదురుగా స్థానిక సంప్రదాయం మేరకు పంచమూర్తుల్ని ప్రతిష్టించారు. నెల్లూరుకు చెందిన దాతలు నూతనంగా తయారు చేసిన రూ.1.36కోట్ల వెండిపల్లకిలో భోళాశంకరుని, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని పడమర దిక్కుగా ప్రతిష్టించగా ఎదురుగా ధ్వజస్థంభం తూర్పు అభిముఖంగా దర్శనమిచ్చింది. అలాగే ఉత్తరాభిముఖంగా వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని దక్షిణాభిముఖంగా వినాయకుని ప్రతిష్టించారు. ఆలయ ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్స్ పర్యవేక్షణలో దీక్షా గురుకుల్స్ డాక్టర్ అయ్యావు(చియ్యా) గురుకుల్ వరదా గురుకుల్, పరశురాం గురుకుల్, వేదపండితులు బాలసుబ్రమణ్యం, సీనియర్ వేదపండితులు పౌరోహితులు అర్థగిరి, శ్రీనివాస శర్మ వేదమంత్రాల్ని పఠిస్తుండగా అష్టదిక్పాలకులు, పంచపాలకులు, వరుణదేవుని కలశాల్ని ప్రతిష్టించారు. శాస్త్రోక్తంగా సంకల్పం జరిపారు. స్వామి అమ్మవార్లకు పండ్లు, పత్రి, పూలతో కూడిన పళ్ళెములు ఊరేగింపుగా నాయకులు, అధికారులు తీసుకొని ధ్వజస్థంభం నుంచి స్వామి గర్భగుడిలో ప్రదక్షిణలు జరిపారు. అనంతరం మళ్ళీ హోమాలు జరిపారు. ఆలయ సంప్రదాయం మేరకు సుమారు రెండు గంటలకుపైగా వేదపండితుల వేదఘోషతో కార్యక్రమాలు సాగాయి. అనంతరం శాస్త్రోక్తంగా మొదట ఆలయం నుంచి ధ్వజమింటిని ఆధిరోహించారు. ఆ తాడుతో పాటు ధ్వజ సంకేతం కల్గిన పటాన్ని ధ్వజస్థంభంమీదికి అధిరోహింపజేసారు. ఈ కార్యక్రమాల్లో ఉభయదారులు బయ్యా నాగమ్మ కుటుంబ సభ్యులు హాజర యారు. ఏర్పాట్లను ఇఒ వికె సాగర్‌బాబు వారి సిబ్బంది వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ సతీష్ మాలిక్, లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, సూపరింటెండెంట్లు పర్యవేక్షణలో ,వారి సిబ్బంది పర్యవేక్షించారు. కాగా ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సతీమణి బియ్యపు వాణి, తనయ బియ్యపు పవిత్రారెడ్డి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అమ్మవారికి 36 గ్రాముల బంగారు తాళిబొట్టు బహూకరణ
చిత్తూరుకు చెందిన కాశీనాధన్ వారి కుటుంబసభ్యులు

యువగళం పాదయాత్రకు

బ్రహ్మరథం పట్టిన జనం

సెల్ఫీల కోసం ఎగబడిన యువత, మహిళలు

నారాయణవనం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 19వ రోజు మంగళవారం సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం వెత్తలతడుకు విడిది కేంద్రం నుంచి ఉదయం 10.30గంటలకు ప్రారంభమైనది. అడుగుపెట్టారు. పాదయాత్ర మొదలైన తర్వాత ముందుగా వెత్తలతడుకు ఆదిఆంధ్రవాడ, పడవేటమ్మయానాధికాలనీ, గోవిందప్పనాయుడుకండ్రిగ, కైలాసకోన క్రాస్, చిత్తూరుకండ్రిగ, రాజులకండ్రిగ, నైనారుకండ్రిగ, తుంబూరు, ఐయ్యవారికండ్రిగ మీదుగా పాలమంగళంకు మధ్యాహ్నం 20గంటలకు చేరింది. ఈ మధ్యలో నారా లోకేష్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. వెత్తలతడుకు విడిది కేంద్రం వద్ద సెల్ఫీలు తీసుకోవడానికి యువకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు ఎగబడ్డారు. అనంతరం కైలాసకోన క్రాస్ వద్ద గాజుల అమ్మే వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. వారి జీవనోధి కష్టాల గురించి లోకేష్‌కు వివరించి, వినతిపత్రం అందించారు. ప్రభుత్వం వస్తే గాజుల అమ్ముకొనే వారికి ప్రత్యేకంగా గుర్తింపు ఇస్తామన్నారు. అక్కడ నుంచి తుంబూరులో దళితులతో సమావేశమయ్యారు. మాజీ మంత్రి ఎన్ అమరనాధరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, సుగుణమ్మ, పాసం సునీల్‌కుమార్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, బీద రవిచంద్రయాదవ్, పులివర్తి నాని, సూర సుధాకర్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ హెచ్ హేలెన్ హేమలత, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్‌రాజు, జెడి రాజశేఖర్, పోతుగుంట విజయబాబు, స్థానిక టిడిపి నేతలు ఎన్ భాస్కరన్, పి గిరిబాబు, టి షణ్ముగం, కెఎస్‌రవి, కందస్వామినాయుడు, విజయకుమార్, పి గోవిందస్వామి, వాసుదేవయ్య, టి కుప్పస్వామి, కె.రమేష్ గాండ్ల, మణిరెడ్డి, మురుగేశరెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, మాణిక్యంరెడ్డి, బీట్ర బాలసుబ్రమణ్యం, మునస్వామియాదవ్, ఇళంగోవన్‌రెడ్డి, తిరుమలైరెడ్డి, దానాపరశురామయ్య పాల్గొన్నారు.

లోకేష్ సభలు కామిడి షోలే

- మంత్రి రోజా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
నగరి నియోజకవర్గం పుత్తూరులో నిర్వహించిన యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తన గురించి ముఖ్యమంత్రి జగనన్న గురించి చేసిన ఆరోపణలపై మంత్రి రోజా మంగళవారం మీడియా ముందు ఘాటుగా స్పందించారు. స్క్రిప్టు రాసిచ్చినా నాలుగు మాటలు సక్రమంగా మాట్లాడని వ్యక్తికి నన్ను, ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత లేదన్నారు. ఐరెన్ లెగ్ లోకేష్ అంకుల్ బహిరంగ సభలు కామిడీ షోల్లా తయారై లోకేష్‌నఉ అందరూ జోకేష్ అంటున్నారన్నారు. ముందు రోజు రాత్రి వచ్చి మరుసటి రోజు సాయంత్రం దాకా టెంట్‌లో దాక్కోవడం సభకు జనం చేరకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూడడం ప్రజలందరికి తెలుసనన్నారు. నాపైనా నా కుటుంబం సభ్యులపై అవినీతి ఆరోపణలు చేశాడని అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు, లోకేష్, బ్రహ్మిణీ, భువనేశ్వరీలే అన్నారు. చిత్తూరు జిల్లాలో పాలు పోసేవారు, కూరగాయలు అమ్మేవారు అలాగే ఉన్నారని వారి నుంచి హెరిటేజ్ పేరిట దోచుకుంటున్న చంద్రబాబు కుటుంబం కోటీశ్వరులెలా అయ్యారో చెప్పాలన్నారు.

లోకేష్ చీరలు పంపాడంటూ

మంత్రి రోజా ఇంట్లోకి వెళ్లే యత్నం

అడ్డుకుని అదుపులోకి తీసుకున్న పోలీసులు

యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ మంత్రి రోజాపై ఘాటు విమర్శలు చేయడంతోఆ వ్యాఖ్యలపై మంత్రి రోజా మంగళవారం లోకేష్‌పై ఘాటు విమర్శలు చేశారు. ఇది తట్టుకోలేని తెలుగు మహిలలు మంత్రి నివాసం వద్ద గొడవచేయాలన్న నెపంతో లోకేష్ చీరలు పంపాడంటూ ఆ చీరను పట్టుకుని కాకవేడు రోడ్డునుంచి మంత్రి నివాసం వైపు ఉన్న చిన్న సందులోంచి పరుగెడుతూ మంత్రి నివాసంలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. విషయం తెలిసి మంత్రి నివాసం వద్దకు చేరుకున్న పోలీసులు రాద్ధాంతం చేస్తున్న తెలుగు మహిళలతో పాటు వారితో వచ్చిన తెలుగుదేశం కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో టీడీపీ కార్యకర్తపోలీసులపైనే చేయి చేసుకునే ప్రయత్నం చేయడంతో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతోపోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న స్థానిక టీడీపీ నాయకులు అదుపులోకి తీసుకున్న వారిని విడిచి పెట్టాలంటూ రాద్ధాంతం చేశారు. వైసీపీ నాయకులు కూడా అక్కడకు చేరుకోవడంతో వారి మధ్య వాగ్వాదం జరిగి పరిస్థితి ఉద్రిక్తకరంగా మారింది.

సంఘమిత్ర భర్త చేతివాటం.. 19.36లక్షల నగదు గోల్‌మాల్

లబోదిబోమంటున్న మహిళా సంఘాలు.. అధికారుల విచారణ.. రికవరీకి ఆదేశాలు !!

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త
ఓ సంఘమిత్ర భర్త తన భార్య ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీలు పర్యవేక్షిస్తూ మహిళా సంఘాలు ప్రతినెలా బ్యాంకులకు చెల్లించాల్సిన అప్పును చెల్లిస్తే ఆ నగదు బ్యాంకులో జమ చేయక చేతివాటం ప్రదర్శించాడు. ఏకంగా 19.36లక్షల దాకా నగదు గోల్‌మాల్ కావడంతో విషయం వెలుగు చూసింది. సదరు సంఘమిత్ర భర్త తాను బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న బ్యాంకుకే మోసం చేసిన వైనం ఇది. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల కథనం మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం పొగురుపల్లికి చెందిన హరి అనే వ్యక్తి కుప్పం కార్పోరేషన్ బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్‌గా ఆర్నెల్లక్రితం చేరాడు. హరి భార్య పొగురుపల్లిలో సంఘమిత్రగా పనిచేసేది. అయితే ఆమె ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో సుమారు 18 మహిళా సంఘాలకు చెందిన ఆర్థిక కార్యకలాపాలకు సంఘమిత్ర అయిన హరి పర్యవేక్షించేవాడు. బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి మహిళా సంఘాలు నగదు అందిస్తే హరి ఆ నగదు తీసుకుని బ్యాంక్ సీల్ వేసి వారికి అందించేవాడు. దీంతో మహిళలు తమ సొమ్ము బ్యాంకులో జమ అయిందని భావించారు. అయితే గత గురువారం ఓ మహిళా సంఘం కార్పోరేషన్ బ్యాంకుకు వెళ్లగా మీ గ్రూపు తీసుకున్న అప్పు నగదు ఎందుకు చెల్లించడం లేదని బ్యాంకు అధికారులు మహిళా సభ్యులను ప్రశ్నించారు. విషయంను మహిళలు గ్రామంలో తెలపగా మిగిలిన సంఘాల మహిళలు కూడా విషయాన్ని వెలుగు సిసి దృష్టికి శనివారం తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ఏరియా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎపిఎం శ్రీనివాస్‌తో పాటు కార్పోరేషన్ బ్యాంకు మేనేజర్, మహిళా సంఘాల లీడర్లు పొగురుపల్లిలో రికార్డులు పరిశీలించారు. మహిళా సంఘాలకు సంబంధించి దాదాపు 19.36లక్షల దాకా నగదును హరి బ్యాంకులో జమ చేయలేదని అధికారులు లెక్కలు తేల్చారు. కాగా ఈ నగదు రికవరీకి అధికారులు రెండు రోజుల గడువు ఇవ్వగా హరి అతని కుటుంబీకులు నెలరోజుల గడువు కోరారు. అయితే ఇందుకు అధికారులు ససేమిరా అన్నారు. జరిగిన విషయంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎపిఎం శ్రీనివాస్ తెలిపారు. మహిళా సంఘాల నగదును హరి పక్కదారి పట్టించింది వాస్తవమేనన్నారు. కాగా హరి మహిళా సంఘాల సొమ్మును ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అందులో కోల్పోయినట్లు సమాచారం.

పొగురుపల్లిలో విచారిస్తున్న అధికారులు

శ్రీశైలం మల్లన్నకు గణనాధుని పట్టువస్త్రాలు సమర్పణ

కాణిపాకం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
శ్రీశైలం శ్రీభ్రమరాంభికా సమేత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు కాణిపాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు దంపతులు, అర్చకులు, శ్రీశైలం చేరుకుని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీశైలం దేవస్థానంకు చేరుకున్న వీరికి ఆలయ పాలకమండలి ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. కాణిపాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు దంపతులకు స్వామివారి దర్శనానంతరం స్వామివారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం పాలకమండలి సభ్యులు అనిత, రామసుబ్బమ్మ, ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడులతో పాటు అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నిబంధనలు అమలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణను నిబంధనల మేరకు పక్కా నిర్వహణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అదికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుండి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉమ్మడి జిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ హరినారాయణన్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌లు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 16వ తేదీ నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, నోడల్ అధికారుల నియామకం, పోలింగ్ నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, కౌంటింగ్ నిర్వహణ, మాస్టర్ ట్రైనర్లచే ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ, స్వీప్ ఆక్టివిటీలో భాగంగా ఓటింగ్ విధానంపై అవగాహన, మండల స్థాయిలో ఎంసిసిల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌లతో పూర్తి స్థాయిలో సమీక్షించారు.

క్యాన్సర్ వ్యాధుల నివారణలో భాగస్వాములవుదాం

-సైకిల్ ర్యాలీలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు క్యాన్సర్ వ్యాధి పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ వ్యాధి నివారణలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమని సూచించారు. దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 14ను ఆయుష్మాన్ భారత్ సంయూక్తంగా హెల్త్‌మేళా సందర్భంగా మంగళవారం స్థానిక బైరాగిపట్టేడ అర్బన్ హెల్త్ సెంటర్ నుండి సైకిల్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ నమోదు 10 శాతంగా ఉందని, స్మోకింగ్ చేయడం వల్ల క్యాన్సర్ సంబంధించిన మరణాలను 45 శాతం నిరోధానికి సహాయపడుతుందని సర్వేలు సూచిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం క్యాన్సర్ నివారణ ప్రథమ స్థాయిలోనే గుర్తించడం, స్క్రీనింగ్ నిర్వహించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మన జిల్లా తిరుపతికి ప్రత్యేకత ఉందని క్యాన్సర్ ఆసుపత్రులు స్విమ్స్, టాటా వంటివి అందుబాటులో ఉన్నాయని, క్యాన్సర్ గుర్తింపుకు, చికిత్సకు ప్రాధాన్యత ఇవ్వటానికి త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను చేపట్టనున్నామని తెలిపారు. ఇందులో 45సంవత్సరాల పైబడినవారికి ప్రాముఖ్యత ఇచ్చి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో రెండు పింక్ బస్సులు ఉన్నాయని, మరో అవసరమని ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎం. అండ్ హెచ్.ఓ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శ్రీనివాసరావు, డి.ఐ.ఓ శాంతకుమారి, డి.ఎస్.ఓ. హర్షవర్ధన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వభూపాల వాహనంపై

రాజులకు రాజు రారాజు

చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:
రాజులకు రాజు రారాజు అయిన దేవదేవుడు శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారు విశ్వంలోని రాజులనే వాహనంగా చేసుకుని సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి స్వామివారు సర్వభూపాల వాహనంపై సమస్త రాజ లాంఛనాలతో తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన కంకణభట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశేషాన్ని వివరిస్తూ సృష్టిలో కల్పవృక్షం కోరిన కోర్కెలను తీర్చగలదని ప్రశస్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్థసారథి, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకారం

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ హరినారాయణన్ విజ్ఞప్తి

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ హరినారాయణన్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9వ తేదీన షెడ్యూల్ జారీ చేసిందన్నారు. జిల్లాలో అదే రోజు నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్

గురువారం విడుదల అవుతుందని, 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ వుంటుందన్నారు. అభ్యర్థుల నుండి నామినేషన్లను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. మార్చి 13వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ విధానంపై ఎలక్షన్ కమీషన్ విడుదల చేసిన విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ అంశంకు సంబంధించి స్వీప్ ఆక్టివిటీస్‌ను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, ఎలక్షన్ సూపరింటెండెంట్ పద్మజ, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, రాష్ట్ర తెలుగు దేశం కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లోకేష్‌బాబు, జిల్లా బిఎస్పీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరీర దృఢత్వానికి సైకిలుతొక్కడం ఉపయోగం

రొంపిచెర్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

శరీర దృఢత్వానికి ప్రతి ఒక్కరు సైకిలు తొక్కడం అలవరచుకోవాలని దీని వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రాజా అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో రొంపిచెర్ల బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సైక్లింగ ్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిలు తొక్కడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. శరీరంలో క్యాలరీలు కరిగి క్యాన్సర ్‌గుండెజబ్బులు,చక్కర వ్యాధి, అధిక రక్తపోటు, థైరాయిడ ్‌రాకుండా అదుపులో పెట్టుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌కుమార్,ఎంఈఓ,ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలి

రొంపిచర్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ప్రభుత్వ మద్యం దుకాణాలలోపని చేస్తున్న సిబ్బంది మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకేఅమ్మాలని చిత్తూరు మద్యం డిపో సబ్‌ఇన్‌స్పెక్టర్ గుంటూరు రామకృష్ణశా స్త్రి హెచ్చరించారు. మంగళవారం ఆయన రొంపిచెర్లలోని రెండు మద్యం దుకాణాలను తనికీ చేశారు. అమ్మకాలు జరిపిన పైకాన్ని తప్పని సరిగా మరుసటి రోజుప్రభుత్వానికి బ్యాంకులకు సకాలంలో చెల్లించాలన్నారు. రాత్రి సమయాల్లో కాపలాదారులు ఖచ్చితంగాఅందుబాటుఓలఉండాలనిచెప్పారు. తామువచ్చినప్పుడులేకుంటే విదుల నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ ్‌కానిస్టేబుల ్‌నాగరాజు, కానిస్టేబుల లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

యువగళం యాత్రను విజయవంతం చేద్దాం

యర్రావారిపాలెం,ఫిబ్రవరి14ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రను జయప్రదంచేద్దాం అని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపర్తి నాని సతీమణి పులిపర్తి సుధారెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నెరబైలులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి నారాలోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్ర చంద్రగిరి నియోజక వర్గంలోకి స్వాగతించేలా ప్రతి క్లస్టర్ నుంచి పార్టీ శ్రేణులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ,ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడు,జిల్లాకార్యదర్శిఅన్నాసముద్రం మధు, రాజన్న, గోపాల , చంద్రశేకరనాయుడు, వేణుగోపాల ్‌నాయుడు,జగన్మోహనరెడ్డి,వెంకటరమణ,శివ,బాలు, విజయారెడ్డి, లక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు ఆర్టీసి డిపోలోఎక్స్‌ప్రస్ సర్వీసులను పెంచండి

-డిఎంకు పిపిఎస్ వినతి

పలమనేరు,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:

పలమనేరు ఆర్టీసి యాజమాన్యం ప్రయాణికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తుందని పలమనేరు పరిరక్షణ సమితి ఆరోపించారు.ఈ మేరకు మంగళ వారం ప్రయాణికుల సమస్యలను పరిష్కరించా లంటు సర్వీసులను పెంచాలంటు డిఎంకు వినతి పత్రం అందించా రు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పలమనేరు ఆర్టీసి డిపో నుండి పలు నగరాలకు గతంలో ఎక్స్‌ప్రస్ సర్వీసులు ఉన్నాయని ప్రస్తుతం ఆ సర్వీసులు లేవన్నారు.పలమనేరు నుండి తిరుపతి రుయా ఆసుపత్రి,వేలూరు సిఎంసి చికిత్స కొరకు వెళ్ళుటకు ఉదయం 5గంటలకు గతంలో ఆర్టీసి బస్సులు ఉండేవని ప్రస్తుతం ఆ సర్వీసులు లేవన్నారు.ఇతర డిపోల నుండి నడుస్తున్న ఎక్స్‌ప్రస్ సర్వీసులు లాభాలలో ఉంటే పలమనేరు డిపో ఎక్స్‌ప్రస్ బస్సులు మాత్రం ఎందుకు నష్టాలలో ప్రయాణిస్తుందని ప్రశ్నించారు.పలమనేరు డిపోలో సర్వీసులను పెంచాలని ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సుబ్రమణ్యం,జాయింట్ సెక్రెటరీ టి.దేవరాజులు,దొరస్వామి,సన్నీరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కైక్లింగ్ వ్యాయామంతో వ్యాధులకు దూరం

తవణంపల్లె, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

స్కైక్లింగ్, వ్యాయామంతో వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా వుండవచ్చునని మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయ చౌదరి అన్నారు. మంగళవారం మండల వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్కైకింగ్, యోగా, వ్యాయామంపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కైకింగ్, వ్యాయామం, యోగా ద్వారా ఒత్తిడిని జయించి, బిపీని నియంత్రణలో వుంచుకుని గుండె జబ్బులను దూరం చేసి దృఢంగా వుండవచ్చునని తెలిపారు. అలాగే స్కైక్లింగ్ ద్వారా అధిక క్యాలరీలను కరిగించి క్యాన్సర్‌ను, గుండె జబ్బులను నివారించవచ్చునన్నారు. యోగా ద్వారా మనస్సు ప్రశాంతంగా వుంచుకుని ఆరోగ్యంగా జీవించవచ్చునని డాక్టర్ దాత్రేయ చౌదరి తెలిపారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీనివాసులు, సుబ్రమణ్యంరెడ్డిలతో పాటు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆటోతో సహా అక్రమ మద్యం పట్టివేత

-ఇద్దరికి రిమాండ్

చౌడేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని ఆటోతో సహా పట్టుకొని నిందితులను రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్.ఐ రవికుమార్ కథనం మేరకు...మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లి లత, బైరెడ్డిపల్లి మండలం ధర్మపురి పంచాయతీ మేకలనాగిరెడ్డిపల్లి నాగరాజులు ఆటోలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా, చౌడేపల్లి వద్దగల బోయకొండ ఆర్చివద్ద దాడిచేసి పట్టుకొన్నారు. వారి నుంచి రూ. 16,116లు విలువ చేయు 576 కర్ణాటక టెట్రాప్యాకెట్లు, ఎపి39టిసి3733నంబరు గల ఆటోను సీజ్‌చేసి నిందితులను పుంగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారిని రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వివరించారు.

సైక్లింగ్‌తో చక్కటి ఆరోగ్యం సాధ్యం

పెద్దపంజాణి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

రోజువారి జీవితంలో సైకిల్‌తొక్కడంవల్ల చక్కని ఆరోగ్యం సాధ్యమౌతుందని ఎంఈఓ హేమలత పేర్కొన్నారు.కేంద్రారోగ్యమంత్రిత్వ శాఖ ఆదేశాలమేరకు మంగళవారం మండలవిధ్యాశాఖ,వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెగా సైక్లోథాన్ ఈవెంటును మండలంలోని పెద్దవెలగటూరు హైస్కూల్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రమంతప్పకుండా రోజువారి జీవితంలో సైక్లింగ్ చేయడంవల్ల విద్యార్థుల్లో దేహదారుఢ్యం పెరుగుదలతోపాటు మానసిక ఉల్లాసంగా ఉంటారని దీంతో విధ్యను అభ్యసించడంలో విద్యార్థులు చురుగ్గా ఉంటారని తెలిపారు.ప్రతిరోజు సైక్లింగ్ చేయడంవల్ల కలిగే ఆరోగ్య ఫలితాల గురించి విద్యార్థినీవిద్యార్థులతో పాటు గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి,వైద్య ఆరోగ్యశాఖ,ఆశా కార్యకర్తలు,సిఆర్పీలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యానికి మేలు

సదుం, ఫిబ్రవరి14 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరు సైకిలు తొక్కడం వల్ల శరీర ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెరకువారిపల్లె ప్రాథమిక వైద్య ఆరోగ్య అధికారి చరణ్ అన్నారు. మంగళవారం సదుంలోని బస్టాండులో సైక్లింగ్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ వారి ఒత్తిళ్లనుంచి బయటపడటానికి శారీరక వ్యాయామం తప్పకుండా చేయాలన్నారు. రక్తపోటు నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. దినమంతా ఉత్సాహంగా ఉల్లాసంగా గడపటానికి వీలవుతుందన్నారు. క్రమం తప్పని వ్యాయామం చక్కటి నిద్రకు ఉపయోగపడుతుందన్నారు. సైకిలుతొక్కడం వల్ల శరీర బరువు తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పజురుల్లా, ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, ఉదయభాస్కర ,పీడీ నారాయణరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

వైకాపా సోషల్ మీడియా కన్వీనర్‌గా గోపినాథ్

పాలసముద్రం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

పాలసముద్రం మండల వైకాపా సోషల్ మీడియా కన్వీనర్‌గా గోపినాథ్ నియమితులయ్యారు. ఆముదాల పంచాయతీకి చెందిన గోపినాథ్ మాట్లాడుతూ తనను పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, డిప్యుటీ సిఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, జడ్పీటిసీ, ఎంపిపి, వైకాపా నాయకులతో ఆయన కృతజ్ఞత తెలిపారు.

గడువులోపు ఇళ్ళ నిర్మాణాలు పూర్తి

- కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణంలో వున్న ఇళ్ళను నిర్దేశించుకొన్న గడువులోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం అనుపల్లి లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ అమినిటీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తూ లేఅవుట్‌లో ఇళ్ళ నిర్మాణాలు ఏ ఏ దశల్లో వున్నాయి! మార్చి 15 నాటికి పూర్తి చేయాల్సిన ఇళ్ళ నిర్మాణాల స్థితిగతులపై సమీక్షించారు. బిఎల్ స్టేజీలో వున్న ఇళ్ళ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని, సమయం దగ్గర పడుతుండటంతో పనులు నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం మేస్త్రీలు, లబ్దిదారులను సమన్వయం చేసుకొని ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ వెంకటేశ్వరరావు, ఎఇ శ్రీధర్, ఎఇ శ్రీలత, అనిమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో వుండాలి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

బడిఈడు పిల్లలందరు తప్పనిసరిగా బడిలో వుండాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. బడి మానివేసిన పిల్లలు, బడిఈడు పిల్లలు, ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో వుండాలన్నారు. పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు గ్రామాల్లో పర్యటించి బడిఈడు పిల్లలను బడిలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. 6-14 సంవత్సరాల మధ్య పిల్లలు తప్పనిస్థితిలో బడికి రావాలని ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓతో పాటు హెడ్మాస్టర్ సుజాత, సిఆర్‌పిలు సుశీల, విల్వనాధన్, సుధాకర్, హైమావతి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజం కోసం కృషి చేయాలి

- ద్రవిడ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి

కుప్పం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మాదకద్రవ్య (డ్రగ్స్) రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ ఎకె వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వర్సిటీలో డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం సందర్భంగా ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సిగరెట్లు, మందు వంటివి ఫ్యాషన్ కోసం అలవాటు చేసుకోరాదన్నారు. వీటికి అలవాటుపడితే బానిసలుగా మారుతారన్నారు. సిగరెట్లు, మందుతో పాటు సెల్‌ఫోన్లు కూడా ప్రమాదమేనన్నారు. వివిధ రకాల గేమ్‌లతో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతోందన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య లోకనాథ ం, ఆచార్య డి. శ్రీనివాస్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య యశోద, పిఒలు డా॥ హరికృష్ణ, డా॥ శ్రీనివాస్, డా॥ శోభరాణి, డా॥ కిషోర్, కళావతి, పిఆర్వో దుర్గా ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో చక్కటి శారీరక..మానసిక ఆరోగ్యం - డా॥ సుభాష్ రాజా

కుప్పంరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మానవ జీవితంలో రోజూ సైకిల్ తొక్కడంతో మంచి వ్యాయామంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని కొత్తపల్లి పిహెచ్‌సి డా॥ సుభాష్‌రాజా పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ సూచనలతో ఆయుష్మాన్ భారత్ ద్వారా మంగళవారం మెగా సైక్లథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ సైకిల్ తొక్కడం ద్వారా హృదయం ఆరోగ్యవంతంగా ఉంటుందని, అలాగే కండరాల శక్తి పెరుగుతుందన్నారు. అలసటస్థాయిని సైక్లింగ్ తగ్గిస్తుందన్నారు. ఎముకలకు పటిత్వం కలిగించడంతో పాటు శరీరంలో కొవ్వును తగ్గిస్తుందన్నారు. ప్రజలు రోజూ కొంత సమయం సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా॥ అనూష, ఎంఎల్‌హెచ్‌పి స్నేహ, సూపర్‌వైజర్ ముత్తుకుమార్, ఎఎన్ఎం కోమల, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ సురేష్‌చే ఉచిత దంత వైద్య శిబిరం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి 22వార్డులోని నారాయణ విద్యాసంస్థలో కౌన్సిలర్ సురేష్‌కుమార్ అధ్వర్యంలో శాంతి దంత వైద్యశాలవారిచే ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ సుదర్శన్,డా॥దివ్యలువిద్యార్థులకుఉచితంగాదంతపరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వినీల్, డా॥ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిపురంలో మెగా సైకిల్ ర్యాలీ

శాంతిపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు కెనమాకుపల్లి హైస్కూల్‌లో మెగా సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా సైకిల్ తొక్కడం వల్ల కలిగే లాభాలను వివరించారు. బిపి, గుండె, మానసిక, శారీరక సమస్యల పరిష్కారంకు సైక్లింగ్ చేయడం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డా॥ వంశీకృష్ణ, లతీఫ్‌ఖాన్, కోదండపాణి, గ్రీటా

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయం

తవణంపల్లె, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

మండల కేంద్రం తవణంపల్లెలో ఎత్తైన కొండపై వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి వేడుకలకు సర్వం సన్నదమైంది. ఆలయంలో ఈనెల 16నుండి 22 వరకు మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి దేవాదాయశాఖ, శ్రీకాళభైరవ దేవస్థానం యువజన సంఘం ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయంకు రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే ఆలయంలో విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఈమేరకు ఆలయంలో ఈనెల 16న స్వామివారికి శేషవాహనసేవ, 17న నందివాహన సేవ, 18న శివరాత్రి వేడుకలు జరుగనున్నాయి.

అలాగే 19న భైరవవాహనం, 20న రావణ బ్రహ్మవాహనం, 21న అధికార నందివాహనం, 22న పుష్పపల్లకీసేవ కార్యక్రమాలను ఉభయదారులు, దేవస్థానంల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించడానికి నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

గూడూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఎన్.యుక్తికా పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు ఎన్.గిరీష్, ఎన్.శ్రావణి, నానమ్మ ఎన్.రమాదేవిల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే కుక్ కట్ చేసి పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు వాచ్‌షాప్ రాము, కెఆర్ఎం సుబ్రహ్మణ్యం, కుమార్‌నాయుడు, పి.శీను, కృష్ణారెడ్డి, సివిఆర్ న్యూస్ సతీష్‌కుమార్, నిర్వాహకురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

నాయుడుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైలు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన ప్రసాద్ (18) అనే యువకుడు రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలియజేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలకు సిద్ధం

తడ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

చారిత్రక ప్రసిద్ధి చెందిన తడ మండలం చినమాంబట్టులోని గంగా అన్నపూర్ణేశ్వరి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ చేజర్ల మునిశ్రీనివాసులు తెలిపారు. ఈ సారి ఉత్సవ కమిటీలో కామిరెడ్డి నందారెడ్డి, వేమనబోయిన భాస్కర్, వాటంబేడు మునుస్వామి తదితరులతో పాటు పాలక మండలి సభ్యులు కూడా ఉన్నట్లు చెప్పారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పాటు మాంబట్టు ఎంపిటిసి వాటంబేటి శ్రీపతి, సర్పంచ్ తొగురు రమణయ్య, కార్యనిర్వహణ అధికారి కె.మమతల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 17న గంగమ్మ గుడి నుంచి మేళతాళాలతో గ్రామస్థులు బయలుదేరి ధ్వజారోహణతో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. 18న టిటిడి హిందూధర్మ ప్రచార పరిషత్ వారిచే హరికథా కాలక్షేపాలు వంటివి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 19న స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని, 20న రాత్రి గ్రామోత్సవం వైభవంగా జరుపుతామని, భక్తులంతా హాజరు కావాలని కోరారు. 21న చినమాంబట్టుల్లో వసంతోత్సవం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

బాలాయపల్లి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయించాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. రామాపురం గ్రామంలో సచివాలయం భవనం పూర్తి చేస్తే వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామ్‌కుమార్‌రెడ్డి చేత ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత ప్రారంభిస్తామన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కాట్రగుంట, పిగిలాం పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనిలో అవినీతి జరుగుతున్నట్లు ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో స్వరూపారాణి, ఏవో వినీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

టిడ్కో గృహాలను పేదలకు వెంటనే ఇవ్వాలి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:

పేదల కోసం నిర్మించిన టిడ్కో గృహాలను మూడు సంవత్సరాల నుంచి వారికి ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని మూడో వార్డు బీసీ కాలనీలో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్రం పేదల కోసం గృహాలు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చేనేత జౌళి శాఖ మంత్రి తీసుకువస్తారని తెలిపారు. కమిషనర్‌కు ఫోన్ చేసి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన ప్రచారం నిర్వహించారు. పేదల కోసం బీజేపీ ఎంతగానో పాటుపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయక

ఎన్నికల నిర్వహణలో ఏలాంటి పొరపాటు జరగరాదు

-జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

శాసనమండలి ఎన్నికల నిర్వాహణలో విధులు ఏలాంటి పొరపాటు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని జె.సి. డి.కె.బాలాజీ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు కేటాయించిన ప్రత్యేకాధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశమై ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేసారు. ప్రధానంగా పోలింగ్ మెటీరియల్ సిద్ధం చేయడం, వాటిని సక్రమంగా పోలింగ్ కేంద్రాలకు అందించడం ప్రణాళిక ప్రకారం జరగాలన్నారు. పి.ఓ.లకు, ఏ.పి.ఓలకు ఆర్‌డిఓల సమక్షంలో ఎన్నికల నిర్వాహణపై శిక్షణ ఇవ్వనున్నామని, ఈ శిక్షణను రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వి.ఆర్. చంద్రమౌళి నిర్వహించనున్నారన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో జరగనున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డిఆర్వో శ్రీనివాసరావు, రిటైర్డ్ జె.సి. చంద్రమౌళి, నగరపాలక డిప్యూటీ కమీషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, తుడ సెక్రటరీ లక్ష్మీ, జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏ.ఒ. సుబ్రమణ్యం, ఎన్నికల తహశీల్దార్ పరమేశ్వరస్వామి, డి.టి. విజయభాస్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని

చంద్రగిరి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ఈ నెల 23, 24 తేదీలలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నియోజకవర్గ కేంద్రంలో వుండవచ్చని అన్నారు. స్థానిక ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. పంచాయతీల వారీగా నాయకులను పాదయాత్ర విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కనీసం పాతిక వేల మందితో నియోజకవర్గ కేంద్రంలో కార్యక్రమాన్ని చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక సైనికుడై పాదయాత్ర విజయవంతం చేయడంలో నిమగ్నమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి రైతులకు "తోట బడి"

ఉద్యానవన శాఖ మండల అధికారి శైలజ

చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

మండల పరిధిలోని నడింపల్లిలో మంగళవారం మండల ఉద్యానవన శాఖ అధికారి ఎస్.శైలజ మామిడి రైతుల తోట బడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిపూత విచ్చుకున్న దశలో ఎటువంటి పురుగు తెగులు మందులు పిచికారి చేయరాదన్నారు. బూడిద తెగులు, తేనెమంచు పురుగు ఉధృతి అధికంగా వున్నప్పుడు ఏ మందులు ఎంత మోతాదులో ఉపయోగించాలో వివరించారు. మామిడి పిందెలు రాలుట నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను విరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి, పాకాల మండల, గ్రామ ఉద్యాన సహాకులు, రైతులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం వల్ల జబ్బులు దరి చేరవు : డాక్టర్లు

నారాయణవనం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

ప్రతిరోజు సైకిల్ తొక్కడం వల్ల ఎలాంటి జబ్బులు దరి చేరవని డాక్టర్లు దర్శిత్‌రాజ్, రాఘసుధ తెలిపారు. మండలంలోని తుంబూరులో మంగళవారం ఆయుష్ మాన్ భారత్‌లో భాగంగా హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో క్యాన్సర్ వ్యాధి ఎలా వ్యాపిస్తుందనే దానిపై అగవాహన కార్యక్రమం చేపట్టారు. ప్రతి నెల 14వతేది జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరికి అవగాహన కల్పిస్తామన్నారు. కావున సైకిల్ తొక్కడాన్ని ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పి జ్యోతి, ఎంపిహెచ్ఎ కాటమ్మ, ఆశా కార్యకర్తలు, స్కూల్ పిల్లలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన డిప్యూటీ కలెక్టర్

నారాయణవనం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సంబందించి మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎపిఐఐసి డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. పోలింగ్ నాటికి అన్ని ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పాదర్శకంగా నిర్వహించడానికి సహకరించాలన్నారు.

16న పుత్తూరు ఎస్ఇబి కార్యాలయంలో వాహనాల వేలంపాట

నారాయణవనం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

పుత్తూరు ఎస్ఇబి కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేయడం జరుగుతుందని సిఐ కృష్ణ, ఎస్ఐ నాగరాజు తెలిపారు. పలు కేసుల్లో మొత్తం 13 వాహనాలను సీజ్ చేసి వున్నామన్నారు. కావున ఆశక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

కొప్పేడులో నారా లోకేష్‌కి ఘన స్వాగతం

నింద్ర,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

మండలంలోని కొప్పేడులో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర పురష్కరించుకొని మండల నాయకులు,కార్యకర్తలు, అబిమానుల మధ్య ఘనస్వాగతం పలికారు. నారాయణవనం మండలంలో పాదయాత్ర ముగించుకొని నింద్ర మండలంలోని కొప్పేడులో పాదయాత్ర ప్రవేశించటంతో కొప్పేడులోని చిత్తూరు మాజీ జిల్లా టిడిపి అధ్యక్షులు తంగరాజన్,మండల నాయకుల ఆద్వర్యంలో నారా లోకేష్‌ని గజమాలతో సత్కరించినారు మహిళలు కర్పూర హారతులిచ్చారు. .మండల కేంద్రంలోని నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతు నాయకులు నారా లోకేష్ కలిసి రైతులకు గత మూడు సంవత్సరాలు మునుపు చెల్లించవలసిన 36 కోట్లు చెరుకు బకాయిలు వెంటనే చెల్లించె విధంగా చర్యలు తీసుకొవాలని వినతిపత్రాన్ని అందజేసారు.ఈకార్యక్రమంలో నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జీ గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షులు ధశరధ వాసు,మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయకుమార్,నాయకులు గాలి రమేష్,బాబుయాదవ్, రవినాయుడు,పరదేశి,రాము,కోటీశ్వరరావు,బాస్కర్,లోకేష్,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

-ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోషరావుకు సిఐటియు వినతి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 'యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్' జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కుమార్ ఏపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావుకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు మంగళవారం సాయంత్రం సిఎండిని యూనియన్ నేతలు జి.గుణశేఖర్,ఎస్‌హరి,కె.రూబెన్, ఆర్.మురళిలు కలిసి సమస్యలపై చర్చించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు,కడప జిల్లాలో కాంట్రాక్ట్ ఉద్యోగులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని,కావున వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.వాచ్‌మెన్‌లుగా ఉన్నవారికి షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోషన్ తీసుకున్న తరువాత వేతనాలు తగ్గాయని,ఆ వేతనాలు పెంచాలని కోరారు.తిరుపతి జిల్లాలో పెయిడ్ హాలిడేలు అమలు కావడం లేదని,వాటిని అమలు పరచాలన్నారు.ఖాళీగా ఉన్న షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. వీరి విజ్ఞప్తిని సానుకూలంగా విన్న సిఎండి సంతోషరావు స్పందిస్తూ..పెయిడ్ హాలిడేస్‌ను తక్షణం అమలు చేస్తామని,ఇతర సమస్యలు కూడాఈ పరిశీలించి నిర్ణయం చేస్తామని హామీ ఇచ్చారు.

కుటుంబ సంబంధాల సమస్వయం..మానసిక ఒత్తిళ్ళ నివారణ దోహదం

చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ఉద్యోగం, కుటుంబ సంబధాల మధ్యన సమన్వయం సాధించడం ద్వారా మానసిక ఒత్తిళ్ళను అధిగమించవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కళ్యాణీ డ్యామ్ వద్ద గల పిటిసిలో మంగళవారం ఆయన టిటిడి సెక్యూరిటీ గార్డులు, పోలీస్ కానిస్టేబుళ్ళకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జీన నైపుణ్యాలను సొంతం చేసుకున్న వారు వృత్తి, ఉద్యోగాలలో ప్రగతి సాధించగలరని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బి.మురళి, ఐసి వై.శ్యామ్‌సుందర్, ఎస్ఐ చిన్న రెడ్డెప్ప, పాల్గొన్నారు.

ఘనంగా గోమాత ఆలింగన దినోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ప్రతి ఏడాది ఫిబ్రవరి 14న గోమాత ఆలింగన దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం తెలియజేయడంతో భారతీయ జనతాపార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి కోలా.ఆనంద్ సారధ్యంలో పట్టణంలోని భరద్వాజతీర్థంలో ఉన్న గోశాలలో ఉన్న గోవులను పూజించి వాటికి అరటిపండ్లు, గ్రాసం అందించారు. ఈసందర్భంగా కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దేశంలో గోమాతలు తగ్గిపోతున్నాయని తద్వారా పాల రైతుల ఉత్పత్తి ప్రజలు కావాల్సినంత లభ్యం కావడం లేదని ప్రతి ఒక రైతు కుటుంబాలు దేశీయ ఆవులను పెంచి తద్వారా పాల ఉత్పత్తులు ప్రజలకు అందిస్తే పాడిరైతు కుటుంబాలుకు ఆర్థిక చేయూతనిచ్చినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, ఇతర రాష్ట్ర జిల్లా పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడంతో ప్రతి ఒక్కరికి ఆరోగ్యం

.తొట్టంబేడు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :సైకిల్ తొక్కడంతోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని తొట్టంబేడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారిణి డాక్టర్ తేజేశ్వరి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యఆరోగ్య సిబ్బంది కలసి సైక్లిథాన్ నిర్వహించారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ విద్యార్థులు సైకిల్ తొక్కడం వల్ల పర్యావరణాన్ని సంరక్షించినవారవుతామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తేజేశ్వరి, పిహెచ్ఎన్ సంపూర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దుష్టపాలన

-అప్పుడు మీపాదయాత్రకు ఆటంకాలు కల్పించారా!

తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్త:

రాష్ట్రంలో గత నాలుగుసంవత్సరాలుగా దుష్టపాలన సాగుతోందని, టిడిపి యువనేత నారాలోకేశ్ పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వణుకు పుట్టి ఇన్ని అడ్డంకులు సృష్టిస్తున్నారని తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ అన్నారు. ఎన్ని ఆటంకాలు జరిపినా లోకేష్‌పాదయాత్ర ఆపడం, ఆగడం జరగదన్నారు. మైక్ లేకపోయినా తన గళం వినిపించుకోకుండా పోరన్నారు. ఉదయించే సూర్యుడికి అరచేతిని అడ్డంగా పెట్టడం,మీరు పాదయాత్రను ఆపడం ఒక్కటేనన్నారు. మీరు గతంలో పాదయాత్ర చేపట్టినపుడు మీలాగ తెలుగుదేశం ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటంకాలు కలిగించారా?అని ప్రశ్నించారు. నాలుగేళ్ళలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఇసుక,మద్యం, గంజాయి,మట్టి ,ఎర్రచందనం ,గ్రానైట్ తదితర అక్రమాల్లోదోచుకుంటున్నారని సుగుణమ్మ ఆరోపించారు. మంగళవారంమధ్యాహ్నం యువగళం పాదయాత్రలో లోకేష్‌ను కలసి తిరుపతి జిల్లా పర్యటన గురించి తెలుసుకున్నారు.

వైసిపికి ఓట్లేయకపోతే ఇబ్బందులకు గురిచేస్తారా?

-టిడిపి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకర్‌నారాయణ

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

గత 2019 ఎన్నికల్లో వైసిపికి ఓట్లేయలేదనే కారణంతో బస్టాండ్ ప్రాంతం,అలాగే పెద్దకాపు లేఔట్ ప్రాంతంతలోని ప్రజలను రోడ్డు విస్తరణ పేరుతో గత నాలుగు నెలలుగా అనేక ఇబ్బందులకు గురిచేస్తారా అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని టిడిపి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకర్‌నారాయణ(చినబాబు) సూటిగా ప్రశ్నించారు.మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటు శ్రీనివాసం,అటు విష్ణునివాసం భక్తుల వసతి సముదాయాలకు,అలాగే ప్రైవేట్ లాడ్జీలు అధికంగా ఉన్న బస్టాండ్ ప్రాంతం,పెద్దకాపు లేఔట్,గ్రూప్ థియేటర్ ప్రాంతంలో అభివృద్ధి అంటూ రోడ్డు విస్తరణలో భాగంగా ఎక్కడికక్కడ రోడ్లు మొత్తం గుంతలు తొవ్వేసి,పనులు సకాలంలో పూర్తి చేయకుండా భక్తులను, స్థానికులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఈ సమావేశంలో నేతలు రామచంద్రారెడ్డి,ప్రకాష్,మునాఫ్,చిన్నా రాయల్,పెంచలయ్య,సత్తు మధుసూధన్,నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి రైతులకు అవగాహన

- వ్యవసాయాధికారి, డీఈ

కేవీబీ పురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

మండలంలోని ఆర్‌బీకే ఏఏఈలచే వ్యవసాయంగా ఉత్పత్తులు వ్యవసాయ రంగ అభివృద్ధి పనులుపై సమీక్ష సమావేశం మండల అగ్రికల్చర్ అధికారిణి నర్మద, డీఈ కె.సుబ్రహ్మణ్యం నిర్వహించారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వివిధ రకాల సబ్సిడీ విత్తనాలను ఆర్‌బీకే కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రబీ సీజన్‌లో వ్యవసాయ అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రభుత్వ సంక్షేమ అవకాశాల గురించి రైతులను ఏ విధంగా అధికోత్పత్తికి త్పోడడాలి తదితర అంశాలపై వ్యవసాయ అధికారి పలు సూచనలు అందించారు. ప్రభుత్వం తరపున క్రాప్‌కు సంబంధించి ఇన్సూరెన్స్ విషయాలను తెలియజేశారు. ప్రభుత్వం దృష్టికి పంటల దిగుబడి అంచనా నివేదికలను తీసుకెళ్తామని ఒక్కొక్క గ్రూపు ద్వారా రైతుల ఏర్పరచి సుమారు 15 లక్షల రూపాయల వరకు సబ్సిడీ పరికరాలను, పనిముట్లను మంజూరు చేసిందని, అదే విధంగా 40 శాతం సబ్సిడీతో 9 గ్రూపులకు అందించామని ఇంకా 8 యూనిట్లు మంజూరు చేయాల్సి ఉందని ఆమె తెలిపారు. మిద్దికండ్రిగ, కొత్తూరు గ్రామాల్లో రెండు సెరికల్చర్ యూనిట్లు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయండి

కేవీబీ పురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలో నేడు బుధవారం చేపడుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు రామాంజులనాయుడు వెల్లడించారు. మండలంలో బుధవారం ఉదయం పిచ్చాటూరునుంచి పాదయాతల్రో మధ్యాహ్నం 2 గంటలకు మిద్దికండ్రిగ గ్రామానికి చేరుకుంటారని, జ్ఞానమ్మ కండ్రిగ, ఆరె, మారప్పరెడ్డి కండ్రిగ, సదాశివపురం, రాయపాడు గ్రామాల మీదుగా చేరుకుని రాత్రి గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ బోర్డు మెంబరు స్వర్గీయ అవసరం బాలకృష్ణారెడ్డి స్వస్థలంలో తన కుమారుడు మాజీ సర్పంచ్ అవసరం సురేష్‌రెడ్డి అనుమతి ప్రకారం అక్కడ బస చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ స్థలంలో మండల ప్రజలందరూ ఆయనకు ఘన స్వాగతం పలికి పాదయాత్రను విజయవంతం చేయాలని రామాంజులనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మునస్వామి యాదవ్, తెలుగుదేశం జిల్లా రైతు నాయకుడు గోపినాథ్‌రెడ్డి, పాతపాళెం చంద్ర, రాయపేడు రామచంద్రయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు శివరావు, చెంగారెడ్డి, మాజీ సర్పంచ్ అవసరం సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

ఆర్ఎం చెంగల్ రెడ్డి

పుత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : ఆర్టీసి బస్సుల్లో ప్రయాణీకుల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సంస్థ రీజనల్ మేనేజర్ టి.చెంగల్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆయన చిత్తూరు మార్గంలో ప్రయాణించే ఆర్టీసి బస్సుల్లో ప్రయాణీకుల సంఖ్య పెంచే అంశాన్ని పరిశీలించారు. స్వయంగా బస్సు ఎక్కి ప్రయాణీకులతో మాట్లాడి వారి సమస్యలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ముఖ్యమైన జంక్షన్‌లలో బస్సు ఎక్కడికి వెళుతోందో ప్రయాణీకులకు వినపడేటట్టుగా కండక్టర్లు గట్టిగా లోడ్ చేస్తే ప్రయాణీకుల సంఖ్య పెరిగి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి మాట్లాడుతూ ఇప్పటికే చిత్తూరు రూట్లో 70 నుంచి 80 శాతం సీట్లు నిండుతున్నాయని, మరింత మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు చేపడతామని ఆర్ఎంకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం భాస్కర్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించండి : ఎపిసి

విజయపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

మండలంలోని 6 నుంచి 14 సంవత్సరాల లోపు బడి బయట పిల్లలను గుర్తించాలని ఎస్ఎస్‌సి ఎపిసి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించి సిఆర్సీ పరిధిలోని పిల్లలను గుర్తించి బడిలో చేరి ంచాలని కోరారు. ప్రతి ఒక్కరు సర్వే నిర్వహించి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఆంజనేయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నివాళి

విజయపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : మండలంలోని కోసలనగరంలో అనారోగ్యంతో మృతి చెందిన ప్రభుత్వోద్యోగి మదన్‌మోహన్ మృతి చెందడంతో మంగళవారం వైసిపి నాయకులు కుమారస్వామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని ఇల్లత్తూరులో సుకేష్ మృతదేహానికి నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. మండల వైసిపి నాయకులు శివరాజు, హరికృష్ణ, గోపినాథ్, శేఖర్‌రాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్‌శాఖ ఎండికి మహాశివరాత్రి ఆహ్వానపత్రిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మహాశివరాత్రి ఉత్సవాలకు దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావును విద్యుత్‌శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలసి మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికను అందించారు. ఈసందర్భంగా సిఎండి మాట్లాడుతూ విద్యుత్ అధికారులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఈ మురళీ, రూరల్ ఎఈ వాసురెడ్డి, డిఈఈ సతీష్‌బాబు, మరియు అకౌంట్ అధికారి నాగేశ్వరరావు, శ్రీకాళహస్తి భూగర్భవిద్యుత్ వ్యవస్థ పరిశీలక ఎఈ నాగరాజు పాల్గొన్నారు.

మహాతి బిక్షుచే నృత్య ప్రదర్శన

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ధూర్జటి కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వర్ధమాన సినీ నటి,కోరియో గ్రాఫర్ మహాతి బిక్షు సారధ్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. వాసవి కళానికేతన్ వి కేశవి(తిరుపతి) వారిచే నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. జ్యోతిర్మయి (కర్నూల్)వారిచే నృత్యప్రదర్శనలు వైజాగ్‌కుచెందిన నృత్యనికేతన్ భరత నాట్య అకాడమి శ్రవణిచే, విష్నేశ్వర నాట్యమండలి నెల్లూరు మాతంగి సారధ్యంలో గయోపాఖ్యానం నిర్వహించారు.

తెదేపాలో పలువురి చేరిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో భాగంగా తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాల్సిందిగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి దారాపాండు, తొట్టంబేడు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయులు, రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రీలతలకు తెదేపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తిరుపతి డివిజన్

దళితుడని వివక్షత చూపుతున్నారు...

-చిల్లకూరు జడ్పీటీసీ మన్నెం శీనయ్య

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:

ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వాడినని తనపై వివక్షనత చూపుతూ అవమానిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం జడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య అన్నారు. మంగళవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ తాను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఇటీవల కాలంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పార్టీ మారి వైసీపీలోకి వచ్చారని ఎలాంటి హోదా లేకున్నా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. మండల కేంద్రంతో తనకు కేటాయించిన సీటులో అనుచరులతో వెళ్ళి మూత్ర విసర్జన చేశారని ఆరోపించారు. అతని బెదిరింపుల కారణంగా తనకు ప్రాణహాని వున్నదని పార్టీ పరంగా తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈమేరకు తిరుపతిలో జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలసి ఫిర్యాదు చేశానన్నారు.

సైనికుల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

-పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు పుష్పాంజలి

తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్త:

దేశ రక్షణకు సరిహద్దుల్లో వీరోచితంగా పోరాడుతూ, దేశ రక్షణలో ప్రాణాలు అర్పిస్తున్న సైనికుల త్యాగం వెలకట్టలేనిదని రాయలసీమ రంగస్థలిఛైర్మన్, బిజెపి నాయకులు గుండాలగోపీనాథరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, జయంత్‌కుమార్,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కృష్ణ,చంద్ర తదితరులు కపిలతీర్థంవద్ద వీరజవాన్ల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు.

లోకేష్ పాదయాత్రకు జనాదరణ లేదు

వైకాపా నాయకులు

పుత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :

నగరి నియోజకవర్గంలో గంజాయి, ఇసుక, గ్రావెల్ దొంగలు ఏ పార్టీలో వున్నారో ప్రజలకు తెలుసునని పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి అన్నారు. యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజాపై చేసిన విమర్శలను ఖండించారు. మంత్రి కుటుంబ సభ్యులపై లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎన్టీఆర్ నుంచి తెలుగుదేశం పార్టీని అప్రజాస్వామికంగా లాక్కున్న కుటుంబం నుంచి వచ్చిన లోకేష్ నీతి మాటలు మాట్లాడడం విడ్డూరంగా వుందన్నారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ డి.జయప్రకాష్ మాట్లాడుతూ ప్రజా సేవ కోసం మంత్రి కుటుంబ సభ్యులు మండలాలను పంచుకుని ప్రజలకు అందుబాటులో వుంటూ సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్రకు జనాదరణ లేదన్నారు. సమావేశంలో మునిసిపల్ ఛైర్మన్ శంకర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ వి.ఎం.మాహీన్, పలువురు వైకాపా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలకన్నా శ్రీకాళహస్తీశ్వరాలయమే ముందు వెలసింది

**మేడసాని మ

వెండి అంబారిలో ఆదిదంపతుల రాజసం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎన్నో ప్రత్యేకతలు చోటు చేసుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఈనేపథ్యంలో మంగళ వారం దేవరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్లు కొత్తగా నెల్లూరు వాస్తవ్యులు రూ.1.36కోట్లు తో అందించిన కొత్త వెండి అంబారిలో భక్తులకు దర్శన మిచ్చారు. గతంలో తెల్లటి పెయింట్ పూసిన పల్లకిల్లో స్వామి అమ్మవార్లు దర్శన మిచ్చే వారు. మంగళవారం ఈ ఉత్సవాన్ని 'ఆహ్వానోత్సవం' అని కూడా పిలుస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ధ్వజారోహణం జరిగిన తరువాత సాయంత్రం స్వామి అమ్మవార్లతో పాటు పంచమూర్తుల్ని ముస్తాబు చేసి పురప్రదర్శనకు తరలించారు. ముందు వినాయకుడు వెళుతుండగా వెనుక వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి, వెనుక జ్ఞాన ప్రసూనాంబ సమేత సోమాస్కందమూర్తి వెండి అంబారిలో భక్తులకు దివ్యదర్శనం ఇస్తూ నాలుగుమాడావీధుల్లో వెలసిన నవసంధి వినాయకులతో పాటు పరివార దేవతలకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానంగా వర్ణిస్తారు. ఈ ఉత్సవంలో ఉమాదేవి సమేత చంద్రశేఖర్ స్వామి కొలువుదీరిన త్రిశూలంను పల్లకిలో ప్రతిష్టించి ప్రతి ఆలయం వద్ద ఆపి అక్కడి దేవతల్ని ఆహ్వానించే కార్యక్రమాల్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

3వరోజు-15.02.2023 రెండవ తిరునాళ్ళు

సూర్యప్రభ-చప్పర వాహనసేవ

మాఘ బహుళ దశమి బుధవారం ఉదయం 9.గం.లకు
రాత్రిః-8 గం.లకు భూత-శుక వాహనసేవ
ఉభయదాతలుః- శ్రీకాళహస్తి హరిజన సేవా సంఘం తరపున
శ్రీ పసల రమణయ్య మరియు గ్రామ పెద్దలు, హరిజనవాడ, శ్రీకాళహస్తి.

శివయ్య ధ్వజారోహణానికి 3984 చీరలు

(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)

శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజారోహణానికి స్థానిక భక్తులు చీరలు అందించి తమ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో భక్తకన్నప్ప ధ్వజా రోహణంతో ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం స్వామివారి ధ్వజారోహ ణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అయితే భక్తులు కొంగు బంగారంగా వరాలిచ్చే శివయ్యకు ధ్వజారోహణం సందర్భంగా చీరలు అందించేందుకు వచ్చిన మహిళా భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించారు. గతంలో ఏర్పడ్డ గందరగోళం దృష్ట్యా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. అంతేకాక ఇఒ కకూడా ఈ అంశంపై దృష్టి సారించారు. గత ఏడాది 3196 చీరలు వస్తే ఈఏడాది భక్తులు 3984 చీరలు అందించారని వీటిని ధ్వజారోహణంపై అధిరోహించినట్లు ఆలయాధి కారుల తెలిపారు. అయితే ఎంతో భక్తిశ్రద్ధలతో వచ్చే భక్తుల మనోభావాలను గౌరవించి వారు అందించే వస్త్రాలను తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ అర్చకులకు మడి వస్త్రాలు

శ్రీకాళహస్తి,ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా కొన్ని సంప్రదాయాల్ని ఆచరించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయంలోని స్వామి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన ధ్వజస్థంభం వద్ద ధ్వజపూజలు జరిపారు. స్వామి అమ్మవార్లమ పల్లకిల్లో ప్రతిష్టించి పూజలు జరిపారు. హోమాలు, కలశస్థాపన గావించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అర్చకులు, వేదపండితులు, పౌరోహితులకు 'మడి వస్త్రాల్ని' ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఒ వికె సాగర్‌బాబు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సుదర్శనం, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు సంబంధం గురుకుల్ పట్టు వస్త్రాలు:

శ్రీకాళహస్తి:శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు స్వామి ధ్వజారోహణం సందర్భంగా అర్చకులు, అభిషేక గురుకుల్, వేదపండితులకు కొత్త వస్త్రాలను మడి వస్త్రాలుగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఒ వికె సాగర్‌బాబులు అందించారు. ఓ వైపు స్వామి అమ్మవార్లకు దాతలు అందించిన పట్టు వస్త్రాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అలంకరిస్తారు. అలాగే స్వామి అమ్మవార్లను అలంకరించే అర్చకులకు దేవస్థానం కొత్త వస్త్రాలను అందించటం ఆనవాయితిగా ఉంది.

ధూర్జటి కళాప్రాంగణంలో నేడు.. 15-02-2023 బుధవారం

భూత-శుకవాహనాలు

మ.3.30గం.నుండి : గిద్దలూరు రమణయ్య వారిచే భగవద్గీత శ్లోకపఠనం
సా.4 గం. నుండి : శ్రీకాళహస్తీశ్వర లలిత కళాపరిషత్, శ్రీకాళహస్తి వారిచే లలిత సహస్రనామ పారాయణం
సా.5 గం.లకు : కె.రమణ చెన్నై వారిచే భక్తి రంజని మరియు అపర్ణ సుధీష్ మరియు జూలుగంటి మోన్విత చే నృత్య ప్రదర్శన
సా.6 గం. నుండి : అనూష యాస్- ఇక్ష స్కూల్ ఆఫ్ డ్యాన్స్, బెంగుళూరు వారిచే శాస్త్రీయ బృంద నృత్యం
రా.7 గం.నుండి : యం.యస్.ఆషా, శ్రీకాళహస్తి వారిచే శాస్త్రీయ బృంద నృత్యం
రా.8గం :(సంగీత కళానిధి-మాండలిన్ మాస్ట్రో) యు.రాజేష్-తంజావూరు గోవిందరాజుల బృందంచే మాండలిన్ ప్యూజిన్
రా.9.30 గం.నుండి: శ్రీమేధా, హైదరాబాదు వారిచే నృత్య ప్రదర్శన
రా.10.30గం.నుండి: కోట యామిని, శ్రీభవానీ, శ్రీకాళహస్తి వారిచే నృత్య ప్రదర్శన
రా.11 గం.నుండి : నటరాజ నృత్యాలయ, తిరుపతి వారిచే నృత్య ప్రదర్శన
రా.11.30గం.: శ్రీ శివపార్వతీ నాటక కళామండలి, పెద్దకనపర్తి, పల్లమాల వెంకట్రామయ్యచే శ్రీరామాంజనేయ యుద్ధం

కొత్త ఆలోచనలతో మట్టి అక్రమ రవాణా!

- ఇక్కడి నుండి పచ్చి ఇటుకలు తమిళనాడుకు తరలింపు
- అక్కడ బట్టీల్లో కాల్చి లక్షల రూపాయలు ఆర్జన

పాలసముద్రం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం నుండి తమిళనాడుకు అక్రమంగా మట్టి రవాణా చేయడానికి స్మగ్లర్లు కొత్త తరహా మార్గంను ఎంచుకొన్నారు. ఇక్కడి నుండి మట్టిగా లారీలు, ట్రాక్టర్లతో తరలిస్తే రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకొంటారని భావించిన స్మగ్లర్లు ఈ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ లభ్యమవుతున్న మట్టితో ఇటుకరాళ్ళు కోసి పట్టి ఇటుకరాళ్ళను తమిళనాడు రాష్ట్రంలోని ఇటుక బట్టీలకు తరలించి అక్కడే కాల్చి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. వెంగళరాజుకుప్పం పంచాయతీ దీనబంధుపురం గ్రామ రైతులు ఈ విషయం గుర్తించి తహసిల్దారు బాబుకు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి ఇక్కడి నుండి ఇటుకలు తీసుకెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో కాల్చిన మట్టి ఇటుకలకు విపరీతంగా డిమాండ్ వుంది. అయితే అక్కడ మట్టి లభ్యత పెద్దగా లేకపోవడంతో తమిళనాడు ఆర్‌కె పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాలసముద్రం మండలం దీనబంధుపురం గ్రామ పరిసరాల్లో వున్న ఎస్సీల పంట పొలాలను లీజుకు తీసుకొన్నాడు. ఈ పంట పొలాల్లో రోజుకు 20 వేల మట్టి ఇటుకల వరకు తయారు చేసి ఇక్కడి నుండి తమిళనాడులోని ఆర్‌కె పేటకు తరలించి అక్కడ బట్టీల్లో ఇటుకలను కాల్చి ఈ వ్యక్తి ప్రతి నెలా లక్షల రూపాయలు ఆర్జిస్తున్నాడు. ఇక్కడి నుండి తమిళనాడుకు ట్రాక్టర్, లారీలో మట్టిను అక్రమంగా రవాణా చేస్తే పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకొని జరిమానాలు విధించే అవకాశం వుండటంతో ఇతను పక్కాగా ఆలోచించి ఇక్కడే మట్టి ఇటుకలను కోసం వాటిని ట్రాక్టర్, లారీల్లో తమిళనాడుకు తరలించి అక్కడే కాల్చి విక్రయిస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చునని నిర్ణయించి పక్కా ప్రణాళికలతో ఇప్పటికే ఈ వ్యక్తి 50 లక్షల రూపాయల మేరకు ఆర్జించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ట్రాక్టర్, లారీలను అడ్డుకొనే పోలీసు కానిస్టేబ్లుకు 500 రూపాయల వరకు చెల్లించి రోడ్ క్లియర్ చేసుకొని లక్షల రూపాయలు ఆర్జిస్తున్నాడని ఆరోపణలు వున్నాయి. ఈ విషయంపై రెవెన్యూ, పోలీసు అధికారులు పక్కాగా చర్యలు తీసుకొంటే ఇక్కడి నుండి తమిళనాడుకు ఈ తరహా మట్టి అక్రమ రవాణాను అరికట్టడానికి అవకాశం వుంది.

కరాటేపోటీల్లో ఓవరాల్‌చాంప్‌గా మదర్‌థెరీసా విద్యార్థులు.

పెద్దపంజాణి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరులో జరిగిన 9వ జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో మదర్‌థెరిసా పాఠశాల (సీబీఎస్ఈ) విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించినట్లు పాఠశాల కరస్పాండెట్ ఎం.రవీంద్రబాబు, పాఠశాశాల డైరెక్టర్ కుమారి శ్రేయ తెలిపారు. మదర్ థెరీసా పాఠశాల 55మంది విద్యార్థినీవిద్యార్థులు కరాటేపోటీల్లో పాల్గొనగా వీరిలో 32ప్రథమస్థానాలు, 24ద్వితియస్థానాలు, 18 తృతీయ స్థానలతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. జాతీయస్థాయి కరాటేపోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులను, కరాటే మాస్టర్ సదాశివంను మంగళవారం పాఠశాల కరస్పాండెట్ ఎం.రవీంద్రబాబు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కుమారి శ్రేయ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఇలాంటి మరెన్నో కార్యక్రమాల్లో పాల్గొనాలని, గెలుపు ఓటములను సమానంగా చూడటం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ డాక్టర్ వై.మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అరుల్ రాజ్, ఉపాధ్యాయులు విధ్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో తెలంగాణ మంత్రి హరీష్‌రావు

తిరుచానూరు,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి తెన్నీరు హరీష్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద ఆశీర్వాద మండపంలో వేదాశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఒ లోకనాథం, ఏఈఒ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్, విఐ రామ్మోహన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి

చంద్రగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా అమరవీరులకు వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘన నివాళులర్పించారు. తొండవాడ జడ్పీహైస్కూల్లో మంగళవారం 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఆత్మాహుతి దాడిలో వీరమరణం పొందిన 40 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి క్యాండిల్స్ వెలిగించి వారి చిత్రాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంఈఒ శ్రీవరం లలితకుమారి మాట్లాడుతూ 40 కుటుంబాలలో చీకటి అలుముకున్న రోజు, యావత్ భారతావనీ ఆగ్రహావేశాలకు గురైన రోజు ఇదే అన్నారు. దేశ వ్యాప్తంగా ఏటా ఫిబ్రవరి 14న ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ అమరవీరులకు నివాళులర్పించడం జవాన్లకు మనం అందించే గౌరవమన్నారు. అమరవీరులకు నివాళులర్పించే కార్యక్రమాన్ని చేపట్టిన వే ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరలోపు ఆలయ పుననిర్మాణ పనులు

-గంగమ్మ ఆలయంలో రెండోవరుస కృష్ణశిలకు పూజలు

తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్త: రాబోవు మేనెల జాతర లోపు తాతయ్యగుంటగంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తిచేయాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఆలయ వర్గాలకు సూచించారు. గంగమ్మ ఆలయ పునర్నిర్మాణపనుల్లో మంగళవారం రెండో వరుసరాతికట్టడం పద్మజఘతి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయంలో కృష్ణశిల రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాయిని కట్టడం పనులకు అమార్చారు. ఇక్కడ పనులు వేగంగా జరగాలని, ఇంకా భక్తిభావంతో గంగమ్మ గర్భాలయ పనులు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఇఒ ఎం.మునికృష్ణయ్య, వైసిపి నాయకులు పాలగిరి ప్రతాపరెడ్డి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం,ఆరోగ్యానికి ప్రాధాన్యత

-క్రీడల్లో విజేతలకు బహుమతులు -జెఇఓ సదాభార్గవి

తిరుమల/తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి: ధార్మిక సంస్థ టిటిడిలో పలురకాలుగా భక్తులకు మెరుగైన సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు టిటిడి జెఇఒ సదాభార్గవి తెలిపారు. ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండి భక్తులకు మరింత మెరుగైన సేవలం దించాలని ఆమె కోరారు. తిరుపతి ఎస్వీ హైస్కూల్ మైదానంలో మంగళవారం క్రికెట్ పోటీలను, టేబుల్ టెన్నీస్‌పోటీలను ఆమె టిటిడి ఉద్యోగసంఘాల నాయకుడు చీర్లకిరణ్, డిప్యూటీ ఇఒ స్నేహ లతతో కలసి ప్రారంభించారు. రానున్న ఆరునెలల్లో ఇతరక్రీడా పరికరాలను సమకూర్చి, గోడలకు క్రీడాంశాలతో కూడిన చక్కటి పెయింటింగ్‌తో మైదానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనంతరం ఆమె సరదాగా ఉద్యోగులతోకలసి చెస్, క్రికెట్ ఆడారు. ఉద్యోగులను ఉత్సాహపరిచారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు : కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ ఎన్నికల సజావు నిర్వహణకు నియమించిన నోడల్ ఆఫీసర్లు వారి విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఆర్ఓ, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ హరినారాయణన్ జెసి వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్‌లతో కలిసి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 13వ తేదీ జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి మేన్ పవర్, మేనేజ్‌మెంట్ ట్రైనింగ్, మెటీరియల్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్లను నోడల్ అధికారులు సమర్థ వంతంగా నిర్వర్తించాలన్నారు. అలాగే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, రిపోర్టింగ్ సెల్, డైలీ రిపోర్ట్స్, స్వీప్ ఆక్టివిటీస్, ఎంసిఎంసి, వెబ్ కాస్టింగ్ తదితర అంశా లకు సంబంధించి నియమించబడిన నోడల్ అధికారులు వారికి నిర్దేశించబడ్డ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ స్టేషన్లలో మౌళిక వసతుల కల్పనను పరిశీలించాలని, ఎన్నికల నిర్వహణకు మాస్టర్ ట్రైనర్లతో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించాలన్నారు. అలాగే పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు తరలింపు, బ్యాలెట్ బాక్సులు భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటును అధికారులు సమన్వయంగా విధులు నిర్వర్తించి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓలు డాక్టర్ రేణుక, శివయ్య, సృజన, డిటిసి బసిరెడ్డి, హౌసింగ్ పిడి పద్మనాభం, డిఇఒ విజయేంద్రరావు, డ్వామా పిడి గంగాభవాని, ఎల్డీఎం శేషగిరిరావు, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, ఇతర సంబంధిత శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి!

-ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: విద్యుత్ ఉద్యోగులు వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఏపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అన్నారు. తిరుపతిలో మంగళవారం (14వ తేదీ) నుండి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ ఇంటర్ సర్కిల్ ఉమెన్ గేమ్స్ అండ్ కల్చరల్ కాంపిటీషన్స్ టోర్నమెంట్ 2022-23 ప్రారంభ కార్యక్రమం సోమవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎండి సంతోషరావు మాట్లాడుతూ మహిళా ఉద్యో గులు ఒకవైపు ఇంటి బాధ్యతలు, మరోవైపు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొనేందుకు సమయాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొంటూ ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థ అభివృద్ధికి తమవంతు చేయూతనందించాలని కోరారు. అనంతరం సంస్థ డైరెక్టర్(ఫైనాన్స్) వి.ఎన్.బాబు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంతో విధులు నిర్వహించడం ద్వారా సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) కె.శివప్రసాద్‌రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.ఎస్.వరకుమార్, డి.వి. చలపతి, కె.గురవయ్య, కెఆర్ఎస్. ధర్మజ్ఞాని, కె.విజయ్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు రాధాజయశ్రీ, కె.లావణ్యలక్ష్మి, విఆర్‌కె.రాజు, ఆదిశేషయ్య, జానకిరామ్, రమణాదేవి, సత్యనారాయణ, పద్మ,స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వాసుదేవరెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార వడివేలు, ఎఇలు వాసురెడ్డి, విజయన్, సురేష్, సుబ్బారావులు పాల్గొన్నారు.

బిజెపి ఎంఎల్‌సి అభ్యర్థి ప్రచారం

నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : నాయుడుపేటలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. పట్టభద్రుల సమస్యలపై బిజెపి తరపున తన వాణి వినిపిస్తానని ఆయన స్పష్టం చేశారు. ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాన నరేంద్రమోడీ అని చెప్పారు. రాష్ట్రంలో అధికార వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రంలోని యువత ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నాయుడుపేటలో మహిళ పట్ల సైకో అసభ్యకర ప్రవర్తన

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

నాయుడుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : నాయుడుపేట రైల్వేస్టేషన్ వద్ద ఓ సైకో వీరంగం సృష్టించాడు. తమిళనాడుకు చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానికులు దేహశుద్ధి చేశారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళుతోంది. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ వద్ద తిరుగుతున్న ఓ సైకో ఆ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో ఆమె ఇద్దరు పిల్లలు భయంతో కేకలు వేశారు. గమనించిన స్థానికులు, కార్‌స్టాండ్ డ్రైవర్లు, యజమానులు ఆ సైకోను పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో అతన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మహాశివరాత్రికి పర్యాటక శాఖ ప్యాకేజీటూర్

తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్త: మహాశివరాత్రి సందర్భంగా పర్యాటకశాఖ తిరుపతి జిల్లాలో తలకోన, గుడిమల్లం, తిరుచానూరు ప్రాంతాల్లోని ఆలయాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ అందుబాటులోకి తీసుకువచ్చిందని టూరిజం డిఎం గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఒక రోజు సందర్శనలో ఈనెల 18వతేదీ తలకోనకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఒక్కరికి టిక్కెట్ 400 రూపాయలుగా, గుడిమల్లం, తిరుచానూరు ఆలయాల టూర్ 400రూపాయలుగా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు 9848007033 నంబర్‌కు సంప్రదించాలని డిఎం గిరిధర్‌రెడ్డి తెలిపారు.

మాజీ ఎంఎల్‌ఏకు ఘనసత్కారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఏ సత్రవాడమునిరామయ్య, ఆయన కుమారుడు సత్రవాడ ప్రవీణ్‌లు తెలుగుదేశంపార్టీ ఆహ్వానం మేరకు పార్టీలో చేరడం తమకు ఎంతోసంతోషంగా ఉందని తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ కోశాధికారి కంటారమేష్ అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, నియోజకర్గ పార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డిని ఎంఎల్‌ఏగా గెలిపించుకుంటామని సత్రవాడ మునిరామయ్య, సత్రవాడ ప్రవీణ్‌లు అన్నారు. పార్టీలో అందరు నాయకులను కలుపుకుని ముందుకెళ్తామని మునిరామయ్య తెలిపారు. అనంతరం వీరిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్‌నాయుడు, దేవీమోహన్ గౌడ్, బషీర్, భాస్కర్‌గౌడ్, ఆర్ముగం, దొరబాబు, శివారెడ్డి, మీర్జావలి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో బతుకు జీవనం దుర్భరం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త : బాల్యవివాహాలతో బాలికల జీవితాలు దుర్భరంగా మారుతాయని పలువురు పేర్కొన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్యం భారం కాదని ఒక బాసట అని అన్నారు. జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీసు శాఖ మరియు బాల్యవివాహాల వ్యతిరేఖ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 18సంవత్సరాలు వయస్సు నిండకముందే వివాహాలు చేయడం వల్ల నిజజీవితంలో ఎన్నో ఆటంకాలను ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుందని తెలిపారు. చట్టవ్యతిరేఖ బాల్యవివాహాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన